భీతిగొల్పుతున్న భారీ వృక్షాలు

- వర్షాకాలంలో ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి
- భయాందోళనలో స్థానికులు
- పట్టించుకోని నగర పాలక సంస్థ అధికారులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురంలోని పలు వీధుల్లో ఉన్న భారీ వృక్షాలు ఎప్పుడు కూలుతాయోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పాపరాజువీధి, సర్కిల్2 కార్యాలయం రోడ్డు, రాణాప్రతాప్ రోడ్లలో ఏళ్ల తరబడి ఉన్న పెద్ద, పెద్ద వృక్షాలు ఇటీవల కురుస్తున్న గాలి, వానలతో కూలి ఇళ్లపై పడుతుండటంతో ఇళ్లు దెబ్బ తింటున్నాయని స్థానికులు చెబుతున్నారు. మరోపక్క ఆ చెట్లు ఎప్పుడు కూలి తమ మీద పడి ప్రమాదాలు సంభవిస్తాయోనని ప్రతి రోజు భయంతో బిక్కుబిక్కుమంటూ గడపాల్సివస్తోందని స్థానిక మహిళలు అందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పాపరాజువీధిలో ఒక భారీ వృక్షం ఇదే విధంగా వర్షాలకు కూలడంతో పక్కనే ఉన్న ఇల్లు దెబ్బతింది. ఆ సమయంలో ఆ సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడి...

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు విరిగిన చెట్ల కొమ్మలు పక్కనే ఉన్న విద్యుత్ వైర్లపై పడుతుండటంతో అవి ఎక్కడ తెగి విద్యుదాఘాతానికి గురవుతామోనని భయపడాల్సి వస్తోందని స్థానికులు అంటున్నారు. సర్కిల్–2 కార్యాలయానికి వెళ్లే రోడ్డులోని ఒక భారీ వృక్షం రోడ్డుకు సగం వరకు కుంగిపోయి ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతి రోజు స్కూల్స్, కాలేజీలకు వెళ్లి వచ్చే తమ పిల్లలు ఎక్కడ ప్రమాదానికి గురవుతారోనని స్థానికులు భయందోళన వ్యక్తం చేస్తున్నారు.



పాపరాజు వీధిలోని నివాసంపై కూలిన భారీ వృక్షం



సర్కిల్ కార్యాలయం రోడ్డులో సగానికి పైగా వంగిపోయి ఎప్పుడు కూలుతుందో అన్నట్టున్న వృక్షం

పట్టించుకోని అధికారులు...

సత్యనారాయణపురం పరిధిలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు భారీ వృక్షాలు నేలకొరుగుతున్నాయి. ప్రతి రోజు ఆయా రోడ్లలో తిరుగుతున్న నగర పాలక సంస్థ అధికారులకు ఇక్కడి పరిస్థితి తెలిసినా తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోగా ఎవరికి వారే తమ సొంత ఖర్చులతో తొలగించుకోమంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంట్లో ఉండాలంటేనే భయపడాల్సి వస్తోంది....



ఇటీవల కురుస్తున్న వర్షాలకు భారీ వృక్షం పెద్ద శబ్దంతో మా ఇంటి సమీపంలో కూలిపోయింది. అసలే రేకుల షెడ్డులో నివాసముంటున్న మా ఇంటిపై పడి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేది. ఇప్పటికే సగానికి పైగా ఒరిగిపోయిన వృక్షాలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. వాటిని తొలగించాలని అధికారులకు ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవట్లేదు. దీంతో ఎప్పుడు మా ఇంటిపై పడుతుందో తెలియక ఇంట్లో ఉండాలంటేనే హడలిపోతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎటువంటి ప్రమాదం జరగకముందే ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించాలి.

– జొన్నలగడ్డ కనకదుర్గ, పాపరాజువీధి

ఖాళీగా ఉన్న 300 ఏఎస్ఓ పోస్టులు భర్తీ చేయాలి

ఏపీ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టికల్ సబార్డినేట్స్ అసోసియేషన్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రవ్యాప్తంగా అర్థగణాంక శాఖలో ఖాళీగా ఉన్న 300 అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టికల్ సబార్డినేట్స్ అసోసియేషన్(అపెస్సా) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రజనీష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం అపెస్సా సర్వసభ్య సమావేశం అర్థ గణాంక శాఖ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 రూరల్ మండలాలు, 9 అర్బన్ మండలాలు మొత్తం 18 మండలాల్లో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులను మంజూరు చేయాలన్నారు. రెవిన్యూ డివిజన్ నందు ఉపగణాంక అధికారి పోస్టును, గణాంక అధికారి పోస్టును మంజూరు చేయాలన్నారు. ఏఎస్ఓ పేరు మండల ప్రణాళిక, గణాంకాధికారిగా మార్చాలని డిమాండ్ చేశారు. గణాంకాధికారికి గెజిటెడ్ హోదా కల్పించాలన్నారు. ప్రతినెలా ఉద్యోగులకు జీతాలు చెల్లించాలన్నారు. ఈ సమస్యలను డైరెక్టర్ గోపాల్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారన్నారు. సమావేశంలో అపెస్సా ప్రతినిధులు కె.చెంచురెడ్డి, ఏపీఎస్ నాయుడు, బీవీ మాధవి, సీహెచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలి

60వ డివిజన్‌లో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని గుర్తుకు చేస్తూ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని మంగళవారం 60వ డివిజన్‌లో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు మోసాలను వివరిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రెస్ మీట్‌ను వీడియో రూపంలో ప్రదర్శించారు. అనంతరం డివిజన్ నాయకుల, కార్యకర్తల సమక్షంలో క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. అనంతరం మల్లాది విష్ణు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని చెప్పి చంద్రబాబు ప్రజలను మోసం చేశారన్నారు.

బస్టాండ్ బదులు చేపల మార్కెట్ పెడతారట...

వైఎస్సార్ సీపీ హయాంలో 60వ డివిజన్‌లో హాస్పిటల్, సచివాలయ భవనం నిర్మించామని, వాటర్ లైన్లు ఏర్పాటు చేశామని చెప్పారు. రూ.10 కోట్లతో సెంట్రల్ పార్క్ కూడా నిర్మించామని, అక్కడ బస్టాండ్‌కు స్థలాన్ని కేటాయిస్తూ జీవో కూడా తీసుకొచ్చామని తెలియజేశారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం బస్టాండ్ తీసేసి చేపల మార్కెట్ పెడతానని చెబుతోందని, దీనినిబట్టి తెలుగుదేశం పరిపాలన తీరు ఎలా ఉందో అర్థం అవుతోందన్నారు.



క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న మల్లాది విష్ణు, అవుతు శ్రీశైలజారెడ్డి

మేం చేసిన మంచి సచివాలయంలో రికార్డుల్లో ఉంది...

జగనన్న హయంలో ఈ డివిజన్లో మొత్తం 18,231 మందికి 56 కోట్ల 69 లక్షల రూపాయలు ఇచ్చామని తెలియజేశారు. ప్రతి డివిజన్లో నవరత్నాలతో పాటు సంక్షేమ కార్యక్రమాలు చేశామని ప్రతిదీ సచివాలయంలో రికార్డు ఉందని తెలిపారు. ఆ విధంగా ఈ ఐదేళ్లలో తెలుగుదేశం ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయగలదా అని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం హయంలో మొదటి సంవత్సరంలోనే డివిజన్‌లో రూ.10 కోట్లను నష్టపోయారని, అదే జగన్ ఉండి ఉంటే ఈ 10 కోట్ల రూపాయలు డివిజన్ ప్రజలకు అందేవని అన్నారు. పేదవాడి కష్టం తెలిసిన వ్యక్తి ఒక్క జగన్ మాత్రమేనన్నారు. ఈ ప్రభుత్వం వల్ల చాలామంది నష్టపోయారని, వారి దగ్గరికి జగన్ వెళుతుంటే ఈ ప్రభుత్వం కేసులు పెడుతోందన్నారు. అధికారంలో లేకపోయినా తాము ధైర్యంగా ప్రజల దగ్గరకు వెళ్లగలుగుతున్నామంటే దానికి కారణం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మంచిపనులే అని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీ శైలజా రెడ్డి, మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌డీ బాబు, జిల్లా కార్యదర్శి ఇస్మాయిల్, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు హరేంద్ర, క్లస్టర్ అధ్యక్షుడు ఏసు, ఫాతిమా, సిరిశెట్టి రాజా, ఫణి, షేర్ అలీ, అన్నపురెడ్డి స్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లతో సర్వేచేసి కాలువల్లో వ్యర్థాలను తొలగించాలి

మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): డ్రోన్ సర్వే చేసి, కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను గుర్తించి పరిశుభ్రపరచాలని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం సత్యనారాయణపురం, బీఆర్‌టీఎస్ రోడ్డు, నాగేశ్వరరావు పంతులు రోడ్డు, శివరావు స్ట్రీట్, హెచ్‌బీ కాలనీ, ప్రియదర్శిని కాలనీ, క్రాంబే రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బందర్, రైవస్, ఏలూరు, బుడమేరు కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థలను డ్రోన్లతో సర్వే చేయించి గుర్రపుడెక్క, వ్యర్థాలతో నిండి ఉన్న చోట పరిశుభ్రపరచి, కాలువల్లో నీటి ప్రవాహం ఆగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, ఇంటింటికి వ్యర్థల సేకరణ కచ్చితంగా జరగాలని, వర్షాకాలం దృశ్య నగరంలో దోమల వల్ల వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు యాంటీ లార్వే ఆపరేషన్లు కచ్చితంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆయన హెచ్‌బీ కాలనీలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

మ్యాన్‌హోల్‌ను మూశారు!

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎట్టకేలకు నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. దేవీనగర్ ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్‌లో ఇటీవల వాటర్ పైపులైన్‌లకు మ్యాన్ హోల్ నిర్మించారు. అంతవరకు బాగానే ఉంది. కానీ మ్యాన్‌హోల్‌కు మూత వేయలేదు. దీంతో ఇక్కడ ఎవరికి వారు వారు తాగిన సీసాలు, వ్యర్థాలను మ్యాన్‌హోల్‌లో ఇష్టారాజ్యంగా వేస్తున్నారు. దీనివల్ల తాగునీరు కలుషితం అవటంతో స్థానికులు పడతున్న అవస్థలను వివరిస్తూ 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేసి పైన చెత్త చెదారం వేయకుండా కవర్ చేశారు. స్పందించిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.



వాటర్‌పైపులైన్ మ్యాన్‌హోల్‌పై కప్పిన సిమెంట్ దిమ్మలు

వాహనాలకు ప్రభుత్వ అధీనంలోనే ఫిట్‌నెస్ చేయాలి

- ఓలా, ఊబర్, ర్యాపిడో కమీషన్లు పెంచాలి
- ఆలిండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):ఆటో, మోటార్ వాహనాలకు బ్రేక్ చేసే పద్ధతి మాన్యువల్‌గా ప్రభుత్వ అధీనంలోనే చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చౌక్‌లో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి కె.దుర్గారావు, జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, ముఠా వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాములు ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. ఆటో, మోటార్ కార్మికుల జీవనోపాధిని కాపాడే విధంగా ప్రభుత్వమే యాప్‌లు నిర్వహించాలన్నారు. ఓలా, ఊబర్, ర్యాపిడో కమీషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. వేలాది రూపాయల జరిమానాలను నిలిపివేయాలన్నారు. అనంతరం అదనపు రవాణా కమిషనర్ ఎల్.ఎస్.ఎం రమాశ్రీకి వినతిపత్రం అందించారు. ధర్నాలో సీఐటీయూ పశ్చిమ సిటీ ప్రధాన కార్యదర్శి ఇ.వి నారాయణ, మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం.బ్రహ్మయ్య, విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు బి.రూబెన్ కుమార్, ఎం.హనుమంతరావు, ఎస్.కె దుర్గావలి, డి.కోటయ్య, మధుబాబు ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకట్రావు, సీహెచ్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సూత్ర - ది ఇండియన్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ ప్రారంభం



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని ఏ–కన్వెన్షన్ సెంటర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సూత్ర – ది ఇండియన్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ (లగ్జరీ రాఖీ అండ్ వరలక్ష్మి ఫెస్టివ్ ఎడిట్) మంగళవారం ప్రారంభమైంది. రాఖీ, వరలక్ష్మి వ్రతం, వెడ్డింగ్‌కు సరిపడా డిజైనర్ ఫ్యాషన్, ఎత్నిక్ వేర్, ఫైన్ జ్యూయలరీ, గిఫ్టులు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. స్టైలో మోడ్ – సాంస్కృతిక శోభతోకూడిన ఫ్యాషన్ సిల్హౌట్స్, యూబీ ట్రెడ్స్ – మాడర్న్ మ్యూజ్ కోసం ఫ్యూజన్ ఎత్నిక్ వేర్, ఇంపీరియల్ తార – లగ్జరీ ఫెస్టివ్ అండ్ బ్రైడల్ కొట్యూర్, మైసూర్ శారీలు – హెరిటేజ్ వీవ్స్ అండ్ హ్యాండ్లూమ్ క్లాసిక్స్, హౌస్ ఆఫ్ వీవర్స్ – నైపుణ్యంతో కూడిన ఆర్టిసానల్ గార్మెంట్స్ లభిస్తాయని పేర్కొన్నారు. ఉదయం పది నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ ఉంటుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగపంచమి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పుట్టవీధిలోని స్వయంభూ శ్రీ బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవాలయంలో మంగళవారం నాగపంచమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిగాయి. స్వామివారికి విశేషంగా పాలు, పసుపు, కుంకుమ, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి పుట్టలో పాలు పోశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు పర్యవేక్షించారు. ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయం, శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో నాగపంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



శ్రీ బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవాలయంలో స్వామివారు

మానవ అక్రమ రవాణా నిరోధక యూనిట్లు బలోపేతం

విముక్తి అధ్యక్షురాలు అపూర్వ డిమాండ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో మానవ అక్రమ రవాణా నిరోధానికి మానవ అక్రమ రవాణా నిరోధక యూనిట్లను బలోపేతం చేయాలని విముక్తి అధ్యక్షురాలు అపూర్వ డిమాండ్ చేశారు. ట్రాఫికర్స్‌కు శిక్షలు పడేలా చేయడంతో పాటు బాధిత మహిళలకు నష్టపరిహారం, పునరావాస సేవలు కూడా మానవ అక్రమ రవాణా నిరోధక యూనిట్ల ద్వారా అందించాలన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని విముక్తి, హెల్ప్, ఆర్ హెడ్స్, గైడ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అపూర్వ మాట్లాడుతూ ట్రాఫికింగ్ ఏ ఒక్కరి ద్వారానో జరిగే నేరం కాదని, ఇది శక్తివంతమైన క్రిమినల్ నెట్‌వర్క్స్ ద్వారా లాభాపేక్షతో నడిచే వ్యవస్థ అని అన్నారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్, సోషల్ మీడియా, నకిలీ ఉద్యోగ ప్రకటనల ద్వారా పేదరికం అంచున ఉన్న వర్గాలను లక్ష్యంగా చేసుకుంటున్నారన్నారు. విముక్తి రాష్ట్ర శాఖ కోశాధికారి లక్ష్మి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను నడిపించే అన్ని రకాల అక్రమ వ్యాపారాలను ధ్వంసం చేయాలన్నారు. విముక్తి రాష్ట్ర నాయకురాలు శాంతి మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల్లో కేవలం 13 జిల్లాల్లో మాత్రమే అధికారికంగా మానవ అక్రమ రవాణా నిరోధక యూనిట్లు ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫికింగ్ కేసుల కోసం కేంద్రీకృత ఆన్లైన్ ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో హెల్ప్ సంస్థ కార్యదర్శి నిమ్మరాజు రామమోహన్, ప్రాజెక్ట్ మేనేజర్ వి.భాస్కర్, ఆర్ హెడ్స్ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.రామకృష్ణ , గైడ్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ సుజాత, విముక్తి ప్రతినిధులు మెహరున్నీసా, శాంతి, అనూష తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరించిన ఆయా సంస్థల ప్రతినిధులు

ఫుట్‌బ్రిడ్జిపై పైపులైన్‌లు తొలగింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్‌లో బుడమేరు ఫుట్‌బ్రిడ్జిపై నిరుపయోగంగా మారిన పైపులను మంగళవారం వీఎంసీ అధికారులు తొలగించారు. బుడమేరు వరదల సమయంలో ఫుట్ బ్రిడ్జి మీదుగా ఉన్న వాటర్, యూజీడీ పైపులైన్‌లను ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్ సమీపంలోని వంతెన మీదుగా మార్పు చేశారు. దీంతో ఫుట్‌బ్రిడ్జి మీద పైపులు నిరుపయోగంగా మారాయి. ఈ పైపుల వల్ల బుడమేరు పెరిగినప్పుడు గుర్రపుడెక్క తదితర వ్యర్థాలు నిలిచిపోయి నీటి ప్రవాహానికి ఆటంకం కలిగేది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫుట్‌బ్రిడ్జి మీద నిరుపయోగంగా ఉన్న పైపులైన్‌ల తొలగింపు పనులు చేపట్టారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 24 మందికి జరిమానా

లబ్బీపేట(విజయవాడతూర్పు): మద్యం తాగి వాహనాలు నడిపిన 24 మందికి న్యాయస్థానం మంగళవారం జరిమానా విధించింది. నగరంలోని ఐదో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 24 మందిని పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేశారు. వారిని ఆరో అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశ పెట్టగా న్యాయమూర్తి లెనిన్‌బాబు జరిమానాలు విధించారు. 11 మందికి రూ.15 వేల చొప్పున, మిగిలిన 13 మందికి రూ.10 వేల చొప్పున జరిమానాలు విధించారు. రోజూ నగరంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు సూచించారు.

విశ్రాంత జీవితం ఆదర్శప్రాయం కావాలి

సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజీత్ మల్లిక్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఉద్యోగ విరమణ కాలంలో పదిమందికి మేలు చేసే సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజీత్ మల్లిక్ సూచించారు. ఎం.జి.రోడ్డులోని జీఎస్టీ భవన్ లో మంగళవారం జరిగిన సూపరింటెండెంట్ ఎం.గిరిబాబు ఉద్యోగ విరమణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో గిరిబాబు అందించిన సేవలు ఉద్యోగులందరికీ మార్గదర్శనమని అన్నారు. గిరిబాబు మాట్లాడుతూ కమిషనర్ అందించిన సహకారం, ప్రోత్సాహం మరువలేనిదన్నారు. అనంతరం గిరిబాబును ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్లు అతీరా ఎస్.కుమార్, రాయలు, ఎం.నాగరాజు ఉద్యోగ సంఘాల నాయకులు యుగంధర్, నవీన్ రాజు, టి.వివేకానంద, గద్దె తిలక్, రాజేశ్వరరావు, సీతారామయ్యచౌదరి, పి.ఎస్ వి.ప్రసాద్, భాగ్యరావు, సామ్రాజ్యం పాల్గొన్నారు.



గిరిబాబును అభినందిస్తున్న కమిషనర్ సుజీత్ మల్లిక్

క్లుప్తంగా

రహదారికి మరమ్మతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ దేవీనగర్‌లో మంగళవారం రోడ్డు మరమ్మతు పనులు నిర్వహించారు. గుంతలు పడిన రోడ్డును సరిచేశారు. డివిజన్‌లో ఇటీవల రోడ్డును తవ్వి యూజీడీ మ్యాన్‌హోల్స్ లెవెల్ చేశారు. వాటర్ పైపులైన్‌ల పనుల కోసం రోడ్లు తవ్వారు.

మహిళా సెషన్స్ కోర్టు ఏపీపీగా మద్ది జ్ఞానాంబ



విజయవాడలీగల్: విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది మద్ది జ్ఞానాంబను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీచేసింది. ఏపీపీగా మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. 1997లో బెజవాడ బార్ అసోసియేషన్‌లో ఆమె సభ్యత్వం తీసుకుని, గత 28 సంవత్సరాలుగా న్యాయవాదిగా ఆమె కక్షిదారులకు సేవలందించారు.

వైభవంగా భారతీతీర్థ జన్మదిన వేడుకలు



విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విధుశేఖర భారతి 33 వ జన్మదిన వేడుకల సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి గురుపాద పూజ, గణపతి హోమం మహాఆయుష్‌హోమం నిర్వహించారు. దేవస్థానం నిర్వహించిన సువాసునులకు, దంపతులకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రారంభమైన భగవద్గీత ప్రవచన మహోత్సవాలు

జగద్గురువు ఆదిశంకరుల విరచిత భగవద్గీత ప్రవచనాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు కార్యక్రమంలో వృత్తిరీత్యా ఐటీ నిపుణుడు, ఆధ్యాత్మికవేత్త అడవికొలను భార్గవ శ్రీరామచంద్రమూర్తి అర్జున విషాదయోగం, సాంఖ్యయోగంలోని విశేషాలను వివరించారు.

క్రీడల్లో సిద్ధార్థ వైద్య విద్యార్థుల ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 24 వరకూ రాజమండ్రి జీఎస్ఎల్ వైద్య కళాశాలలో జరిగిన అంతర్ వైద్య కళాశాల క్రీడా పోటీల్లో ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల విద్యార్థులు సత్తా చాటారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు తెలిపారు. తమ విద్యార్థులు బాల్ బ్యాడ్మింటన్, చెస్ రన్నర్స్ ట్రోఫీ, వాలీబాల్, లాన్ టెన్నిస్‌లో తృతీయ బహుమతులు పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా క్రీడల్లో ప్రతిభ చూపిన టీమ్ కెప్టెన్‌లు జి.మనస్వి, డి.వర్ష, ఎం.సాయిదివ్య, జి.నీలోత్సవ్‌తో పాటు, ఇతర క్రీడాకారులను మంగళవారం డాక్టర్ ఏడుకొండలరావు, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రశాంతి, డాక్టర్ ఎం.విజయశ్రీ, ఫిజికల్ డైరెక్టర్ రాము జరుబుల అభినందించారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం

రోడ్డు పక్కన పేరుకుపోయిన చెట్ల వ్యర్థాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 28వ డివిజన్ బాబూరావు మేడ రోడ్డు, రాజేశ్వరి రోడ్డు పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఇక్కడ చెత్తచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతూ ఉంది. వారం రోజుల క్రితం తొలగించిన చెట్లకొమ్మలను సైతం రోడ్డు పక్కనే వదలివేశారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారటంతో పాటు క్రిమి కీటకాలు, దోమలు పెరిగిపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు మార్జిన్‌లలో చెట్లకొమ్మల వ్యర్థాలు ఉండటం వల్ల కనీసం రాకపోకలు సాగించే క్రమంలో రోడ్డు మార్జిన్ దిగలేని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఇక్కడ కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై వర్షపునీరు నిలిచి పోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై పేరుకుపోయిన చెత్తచెదారం, చెట్లకొమ్మలు, వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.